
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
25-9-2025 (Thursday)
MAIN EDITION

## అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేల డుమ్మా.. చంద్రబాబు సీరియస్



**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యేల హాజరు తీరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలకు లేటుగా హాజరై కొద్ది సేపు సభలో ఉండి మళ్లీ వెళ్లిపోవడాన్ని గమనించిన సీఎం.. ఇది రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల చర్చలకు హాని కలిగిస్తుందని అన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతో మాట్లాడి ఎమ్మెల్యేలు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి



**అక్షరటుడే, తిరుమల:** తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారు చిన్నశేష వాహనంపై దర్శనం ఇచ్చారు. కాగా.. శ్రీవారిని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం దర్శించుకున్నారు. వారికి వేద పండితులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వారికి ప్రసాదాలను అందజేశారు.

## రైలు నుంచి అగ్నిప్రైమ్ క్షిపణి ప్రయోగం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** క్షిపణుల అభివృద్ధిలో భారత్ మరో అడుగు ముందుకేసింది. డీఆర్‌డీవో మరో కీలక ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించింది. రైలు నుంచి అగ్నిప్రైమ్ క్షిపణిని ప్రయోగించింది. ఒడిశాలోని బాలాసోర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో బుధవారం రాత్రి విజయవంతంగా ప్రయోగాన్ని పూర్తి చేసింది.

## 'భూ భారతి' ఆపరేటర్లకు జీతాల పెంపు




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఆపరేటర్లకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. టెర్రాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఫీల్డ్ స్టాఫ్‌కు భారీగా జీతాలు పెంచింది. గతంలో వారికి నెలకు రూ.12 వేల వేతనం ఉండగా.. తాజాగా ప్రభుత్వం రూ.28,148లకు పెంచింది.

## మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో మద్యం దుకాణాల టెండర్లకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయ్యింది. కొత్త దుకాణాల కేటాయింపు కోసం ఈ నెల 26 నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అక్టోబర్ 23న దుకాణాల కేటాయింపు కోసం డ్రా తీస్తారు. డిసెంబర్ 1 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభమవుతాయి.

## టీజీపీఎస్సీ గ్రూప్–1 తుది ఫలితాలు విడుదల




**అక్షరటుడే, హైదరాబాద్:** టీజీపీఎస్సీ గ్రూప్-1 తుది ఫలితాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. మొత్తం 562 గ్రూప్-1 సర్వీసు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ బుధవారం అర్ధరాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న పోస్టుల ప్రాధాన్య క్రమం ఆధారంగా ఆయా పోస్టులకు ఎంపికైన వారి వివరాలు వెల్లడించింది. మొత్తం 563 పోస్టులకు గాను 562 అభ్యర్థులను ఎంపిక చేసినట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. న్యాయ వివాదం నేపథ్యంలో మిగిలిన ఒక్క పోస్టును విత్‌హెల్డ్‌లో పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

## విమానాన్ని ఢీకొన్న పక్షి.. తప్పిన ప్రమాదం




**అక్షరటుడే, హైదరాబాద్ :** ఇండిగో విమానానికి ప్రమాదం తప్పింది. ల్యాండింగ్ సమయంలో ఫ్లైట్‌ను పక్షి ఢీకొంది. హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గురువారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. జైపూర్ నుంచి శంషాబాద్ వచ్చిన విమానం ల్యాండ్ అవుతుండగా పక్షి ఢీకొంది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అయితే పైలట్ అప్రమత్తతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో విమానంలో 162 మంది ప్రయాణికులు ఉన్నారు. పైలట్ చాకచక్యంగా ఫ్లైట్‌ను సురక్షితంగా ల్యాండ్ చేశారు.

## వెస్టిండీస్ సిరీస్‌కు భారత జట్టు ఇదే..

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ 2025 ముగిసిన వెంటనే భారత క్రికెట్ జట్టు విండీస్ పర్యటనకు సిద్ధమవుతోంది. అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్టుల సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును అధికారికంగా ప్రకటించింది. ఈ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ టెస్ట్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు.

### భారత జట్టు ఇదే..

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, నితీశ్ కుమార్ రెడ్డి, జగదీశన్, కుల్దీప్ యాదవ్.



## కాళేశ్వరం అక్రమాలపై

# సీబీఐ..




### విచారణ ప్రారంభించిన కేంద్ర దర్యాప్తు సంస్థ

**కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలను వెలికి తీసేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) రంగంలోకి దిగింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు గురువారం నుంచి దర్యాప్తును ప్రారంభించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని, దీనిపై నిగ్గు తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీంతో రంగంలోకి దిగిన దర్యాప్తు సంస్థ అధికారులు గురువారం నుంచి విచారణ ప్రారంభించారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీతో పాటు పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రాథమిక విచారణ మొదలు పెట్టారు. కీలక ఫైళ్లను పరిశీలిస్తున్నారు. వీటి ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టనున్నారు.**

**-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిపోయింది. కాళేశ్వరంలో గుండెకాయ వంటి మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగి పగుళ్లు వచ్చాయి. ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచే ఎన్నో అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు కట్టిన మూడేళ్లకు మేడిగడ్డ కుంగడం.. ఆరోపణలకు బలం చేకూర్చినట్లయింది. ఇదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఎన్నికల చెప్పిన విధంగా కాళేశ్వరం అక్రమాలపై విచారణకు ఆదేశించింది. విజిలెన్స్, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, పీసీ ఘోష్ కమిషన్‌ను రంగంలోకి దింపి విచారణ చేయించింది. ఈ క్రమంలో భారీగా అవినీతి బయటపడింది.

### అనేక అవకతవకలు..

ప్రాజెక్టులో అనేక లోపాలున్నాయని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చింది. ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని వెల్లడించింది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా నిర్మాణం జరిగిందని, మెయింటెనెన్స్ లేకపోవడం వల్లే మూడు బ్యారేజీలలో భారీగా డ్యామేజ్ జరిగిందని తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా బరాజ్‌ల నిర్మాణాలకు బడ్జెట్ విడుదలైందని నిర్ధారించింది. సరైన ప్రణాళిక లేకుండా మేడిగడ్డ నిర్మాణం చేపట్టారని, నిపుణుల కమిటీ సిఫార్సు చేయకపోయినా అప్పటి సీఎం ఆదేశాలతో మేడిగడ్డ బరాజ్ నిర్మాణం జరిగిందని తేల్చింది. భద్రతా ప్రమాణాలను పాటించలేదని, పనుల పర్యవేక్షణలో లోపాలున్నాయని వెల్లడించింది. నిర్మాణ అంచనాలు పెంచి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, ప్రాజెక్టు ఖర్చు రూ.38,500 కోట్ల నుంచి రూ.1.10 లక్షల కోట్లకు పెరిగిందని పేర్కొంది. కేంద్ర జల సంఘం సూచనలు పట్టించుకోలేదని, రాజకీయ జోక్యం, పరిపాలనా నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్ట్ దెబ్బతిన్నట్టు కమిషన్ పేర్కొంది.

### విచారణపై ఉత్కంఠ

కాళేశ్వరం అక్రమాలను నిగ్గు తేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి కేసును అప్పగించింది. ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ తెలంగాణ శాసనసభ తీర్మానం చేసింది. కాళేశ్వరం అవకతవకలపై సుదీర్ఘ విచారణ చేపట్టిన తర్వాత సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్లు అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రాజెక్టు పేరుతో దోచుకున్నవాళ్లందరికీ శిక్షపడాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 2న సీబీఐకి లేఖ రాసింది. దీంతో తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. కాగా.. సీబీఐ తదుపరి విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెల కొంది. ముఖ్యంగా పలువురు ఐఏఎస్ అధికారులు, ఇంజినీర్లను సీబీఐ విచారించి అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అలాగే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను విచారణ ఎదుర్కోక తప్పదనే వాదన వినిపిస్తోంది.

## స్మితా సబర్వాల్‌కు హైకోర్టులో ఊరట



**అక్షరటుడే, హైదరాబాద్:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరిపిన పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తనపై చర్యలు చేపట్టవద్దని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని స్మిత దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్మితా సబర్వాల్ తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు వాదనలు వినిపించారు. గతంలో సీఎంవో కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ కాళేశ్వరం పనుల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారని ఘోష్ కమిషన్ పేర్కొంది తప్ప.. ఆమె అవకతకవకలకు పాల్పడినట్లు చెప్పలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఆమెకు ఊరట కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఘోష్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.


## సృష్టి క్లినిక్‌పై ఈడీ కేసు నమోదు




**అక్షరటుడే, హైదరాబాద్:** సరోగసి పేరుతో మోసాలకు పాల్పడ్డ సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌పై ఈడీ కేసు నమోదు చేసింది. ఈ క్లినిక్ పేరిట డాక్టర్ నమ్రత ఎంతో మందిని మోసం చేసిన విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో ఈ కేసు ఇటీవల సంచలనం సృష్టించింది. డాక్టర్ నమ్రత తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో సైతం సృష్టి క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేసింది. ఐవీఎఫ్ కోసం తన దగ్గరకు వచ్చే వారిని సరోగసి వైపు ఆమె మళ్లించేది. అయితే సరోగసి ద్వారా కాకుండా ఇతరుల పిల్లలను ఆ దంపతులకు అప్పగించేది. సరోగసి పేరిట వారి నుంచి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసింది. పేద దంపతులు, చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాల దగ్గర నుంచి పిల్లలను కొనుగోలు చేసి దంపతులకు ఇచ్చేది. ఈ వ్యవహారంపై ఓ జంట ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో పాటు పలువురిని అరెస్ట్ చేశారు.

కాగా.. సరోగసి పేరుతో పిల్లల ట్రాఫికింగ్‌కు పాల్పడ్డ సృష్టి క్లినిక్‌పై ఈడీ తాజాగా కేసు నమోదు చేసింది. సృష్టి క్లినిక్ నిర్వాహకులు 4 నెలల్లో రూ.500 కోట్ల లావాదేవీలు జరిపినట్లు ఈడీ గుర్తించింది. ఈ వ్యవహారంపై త్వరలో డాక్టర్ నమ్రతను విచారించనుంది.

## స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మేకిన్ ఇండియా ద్వారా దేశం స్వావలంబన సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గించుకోవాలని, ఇతరులపై ఎక్కువగా ఆధారపడుతుంటే ఆశించిన వృద్ధి నమోదు కాదని తెలిపారు. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా అనేక అనిశ్చితులు ఉన్నప్పటికీ.. భారతదేశ వృద్ధి ఆకర్షణీయంగా ఉందన్నారు. వృద్ధిలో భారత్ దూసుకుపోతోందని వివరించారు. సంక్షోభాలను అధిగమిస్తూ స్వావలంబన సాధిస్తున్నామని చెప్పారు. మేక్ ఇన్ ఇండియాతో భారత్ స్వయం సమృద్ధి సాధిస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

## వచ్చే నెలలో బీహార్ ఎన్నికల నోటిఫికేషన్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ సన్నాహాలు చేపట్టింది. అక్టోబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశముంది. ఆ లోపు అధికారుల బదిలీలు పూర్తి చేయాలని బీహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 6 నాటికి ప్రభుత్వ అధికారుల బదిలీలు, పోస్టింగ్ ప్రక్రియలన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించింది. ప్రక్రియ పూర్తవగానే షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

## వేటు వేస్తారా.. వేచి చూస్తారా..?

- తెగని ఫిరాయింపుల వ్యవహారం
- నోటీసుల దశ దాటని విచారణ
- స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ



**అక్షరటుడే, హైదరాబాద్ :** ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఎటూ తేలడం లేదు. నోటీసుల దశ దాటి విచారణ ముందుకు సాగడం లేదు. ఇప్పట్లో తేలే పరిస్థితి కూడా కనిపించట్లేదు. సుప్రీంకోర్టు విధించిన గడువు సమీపిస్తున్న తరుణంలో సభాపతి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కోర్టు ఆదేశాల మేరకు వేటు వేయక తప్పదని బీఆర్ఎస్ పార్టీ చెబుతుంటే, అలాంటిదేమీ ఉండదని అధికార కాంగ్రెస్ చెబుతోంది. ఫిరాయింపులపై నిర్దిష్టమైన విధివిధానాలు లేవని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన తరుణంలో పది మంది ఎమ్మెల్యేల భవితవ్యం ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించడం లేదు.

### బీఆర్ఎస్ పోరాటం..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై పోటీ చేసిన గెలుపొందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమని చెబుతూ అధికార పార్టీ గూటికి చేరారు. అయితే, గతంలో భారీగా ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్ఎస్.. తాజాగా గోడ దూకిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని పోరాటం చేస్తోంది. పక్క పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు కట్టబెట్టిన ఉద్యమ పార్టీ.. ఇప్పుడు ఫిరాయింపులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నెలలు గడుస్తున్నా స్పీకర్ ఫిరాయింపుల ఫిర్యాదులపై తేల్చకపోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. మూడు నెలల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సభాపతికి నిర్దేశిత గడువు విధించింది.

### నోటీసులతోనే సరి..

ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో చర్యలు చేపట్టాలని సుప్రీం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సభాపతి ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. ఫిరాయింపు ఫిర్యాదులపై సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అయితే, ఫిరాయింపులపై బీఆర్ఎస్ బలంగా వాదనలు వినిపిస్తుండడంతో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.